ప్రజాశక్తి
www.prajasakti.com
I

ఎంఎస్ఎంఇలకు రూ.4,000 కోట్లు

- చిన్న పరిశ్రమలకు అండగా ఉంటాం
- ఉపాధి నైపుణ్యాలను పెంపొందించేందుకు చర్యలు
- దళిత, మహిళ పారిశ్రామికవేత్తలకు మద్దతు
- సిఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ ఎంఎస్ఎంఇ -2024 పాలసీ ఆవిష్కరణ

తెలంగాణ ఎంఎస్ఎంఇ పాలసీని ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)లకు మద్దతుగా నిలువాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన 'తెలంగాణ ఎంఎస్ఎంఇ పాలసీ 2024'ను బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఐటి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు ఆవిష్కరించారు. శిల్పాకళా వేదికలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 22 పారిశ్రామిక సంఘాలు సహా అనేక మంది పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఎంఎస్ఎంఇలకు దన్నుగా ఉంటామని చెప్పారు. ఈ పరిశ్రమలకు వచ్చే ఐదేళ్లలో రూ.4,000 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పెట్టుబడులతో రాష్ట్ర ఆదాయాలను పెంచాలని పారిశ్రామికవేత్తలను ఆయన కోరారు.

తాము చేసే ప్రతీ ప్రయత్నమూ రాష్ట్ర భవిష్యత్తు కోసమేనన్నారు. విద్యార్థులకు ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్నారు. యువతకు వ్యవసాయం, పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టేందుకు తగిన చేయూతనిస్తామని తెలిపారు. పరిశ్రమల రంగానికి గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను దశల వారిగా చెల్లిస్తామన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నప్పుడు పివి నరసింహారావు కృషిని మర్చిపోలేమన్నారు. విధానాల రూపకల్పనలు లేకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదన్నారు. రాష్ట్రంలోని విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం టాటా గ్రూపుతో కీలక ఒప్పందం కుదర్చుకున్నామని చెప్పారు. అదే విధంగా స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేసి మహీంద్రా గ్రూపు ఛైర్మెన్ ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా పెట్టామన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఏడాది లక్ష మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారనీ, ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చుతున్నామన్నారు. వీటిని రూ.2400 కోట్లతో ఆధునీకరిస్తున్నామన్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు వెచ్చిస్తుంటే.. టాటా గ్రూపు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా రూ.2,100 కోట్లు అందించడానికి ముందుకు వచ్చిందన్నారు. దీంతో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించాలని నిర్ణయించామన్నారు. వ్యవసాయం అనేది దండగ కాదు.. పండగ అనేది మా ప్రభుత్వ నినాదమన్నారు. అలాగని ఇంటిలో అందరూ వ్యవసాయంపైనే ఆధారపడటం ద్వారా పెద్దగా ఆదాయాలు రావన్నారు. ఇద్దరు, ముగ్గురు వ్యవసాయం పని చేయాలని.. మిగితా వారు ఉపాధి, వ్యాపార అవకాశాలపై దృష్టి పెట్టాలన్నారు. దాంతో కుటుంబ ఆదాయాలు పెరుగుతాయని సూచించారు. వ్యవసాయానికి మద్దతుగా రూ.18వేల కోట్ల నిధులు విడుదల చేసి రైతుల రుణాలు తీర్చామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నీరు, ఆర్థిక సాయం అందిస్తామని సిఎం తెలిపారు.. మూసీ నది వీక్షణకు ఇతర దేశాల నుంచి పర్యటకులు వచ్చేలా అభివృద్ధి చేస్తామన్నారు.

దళిత పారిశ్రామికవేత్తలకు మద్దతు

దళితులు, గిరిజనలు, మహిళలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బాగుపడినట్లని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కూడా ఎంతో మెరుగుపరుస్తున్నామన్నారు. దళిత పారిశ్రామికవేత్తలు రాణించేలా మద్దతును అందిస్తామని సీఎం రేవంత్ తెలిపారు. వారికి సబ్సిడీ, యూనిట్ల ఏర్పాటుకు భూమిని కల్పిస్తామన్నారు. రాష్ట్ర ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలంటే.. ఎంఎస్ఎంఈల పాత్ర కూడా కీలకమన్నారు. ఎంఎస్ఎంఈలపై చేసే వ్యయాలను తాము ఖర్చుగా భావించడం లేదని.. పెట్టుబడిగా పరిగణిస్తున్నామన్నారు. ప్రస్తుతం రూ.3 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్.. 2028 నాటికి రూ.7 లక్షల కోట్లకు చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

జిడిపికి తోడ్పాటు : భట్టి విక్రమార్క

దేశ, రాష్ట్రాల జిడిపికి ఎంఎస్ఎంఈలు ఎంతో తోడ్పాటును అందిస్తున్నాయని మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలతోనే ఎంఎస్ఎంఈ నూతన పాలసీ తీసుకొచ్చామన్నారు. చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఈలు మూతపడగా.. తెలంగాణలో మాత్రం పటిష్టంగా ఉన్నాయన్నారు. ఇటీవల సీఎం విదేశీ పర్యటనలో రూ.80వేల కోట్ల పెట్టుబడులకు బహుళజాతి కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,హైదరాబాద్ మాత్రమే కాకుండా ఇతర జిల్లాలు కూడా సమానంగా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకోసం పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ మౌలిక వసతులతో ప్లాట్ ఫ్యాక్టరీస్ ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నామన్నారు. కొత్తగా క్లస్టర్లను ఏర్పాటు చేయడం ద్వారా స్థానికంగా ఉన్న వారు పారిశ్రామికవేత్తలుగా మారడానికి అవకాశం లభించనుందన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈలు ఎగుమతుల స్థాయికి ఎదగాలన్నారు. ఎంఎస్ఎంఈలు సాంకేతికతను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ పరిశ్రమలకు చెందిన 120 మంది ప్రముఖుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని పాలసీని రూపొందించామన్నారు. తెలంగాణ ఒక్క లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థకు చేరుకోవాలని సీఎం రేవంత్ సంకల్పించారన్నారు.

నల్గొండలో బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌ను కూల్చేయండి : హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీకి హైకోర్టులో బిగ్‌షాక్ తగిలింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్మించిన బిఆర్ఎస్ కార్యాలయాన్ని 15 రోజుల్లోగా కూల్చేయాలని కోర్టు బుధవారం ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన తర్వాత అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించింది. పార్టీ ఆఫీసును రెగ్యులరైజ్ చేసేందుకు మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని బిఆర్ఎస్ వేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. బిఆర్ఎస్ పార్టీకి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని అధికారులను ఆదేశించింది.

అప్పీల్‌కు వెళ్తాం
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చేయాలన్న హైకోర్టు ఆదేశంపై అప్పీల్‌కు వెళ్తామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామన్నారు. కూల్చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, కూల్చడమే పనిగా పెట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చడం కాదు నిలబెట్టడం నేర్చుకుంటే మంచిదన్నారు.

పాలును రోడ్డుపై పారబోస్తూ నిరసన తెలుపుతున్న పాడి రైతులు

బిల్లుల కోసం పాడి రైతుల ధర్నా

- వెంటనే చెల్లించాలంటూ తహశీల్దార్‌కు వినతి
- మద్దతుగా బిఆర్ఎస్ నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాడి రైతులు ధర్నా నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఆమగనల్ పట్టణంలో బుధవారం రైతులు ఆందోళన తెలపగా, వీరికి మద్దతుగా బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నేనావత్ పత్యా నాయక్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై వందల లీటర్ల పాలను పారబోసి నిరసన తెలిపారు. అనంతరం అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ తీసిన.. రైతులు, బిఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమనగల్, కడ్తాల్ మండలాల పిఏసిఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, మాజీ జడిపిటిసి నేనావత్ అనురాధపత్యానాయక్ మాట్లాడారు. మూడు నెలలుగా పాల బిల్లులు ఇవ్వకపోవడంతో పాడి రైతుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాడి రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ శ్రేణులు, పాడి రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు దోనాదుల కుమార్, సరిత పంతునాయక్, మాజీ సర్పంచ్ వద్యావత్ సోనా శ్రీను నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, సీనియర్ నాయకులు, ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పాడి రైతులు పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యకు ఆర్థిక సాయం

- బిసి ఓవర్సీస్ విద్యానిధికి అక్టోబర్ 15 వరకు గడువు

హైదరాబాద్ బ్యూరో : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బిసి, ఒబిసి విద్యార్థులకు తమ దరఖాస్తులను అక్టోబర్ 15 వరకు సమర్పించాలని బిసి సంక్షేమ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన బిసి, ఇబిసిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జులై ఒకటి నాటికి 35 ఏండ్లు నిండకుండా, ఏడాదికి కుటుంబ ఆదయం రూ.ఐదు లక్షల లోపున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

నూతన ఇహెచ్ఎస్ విధానం కోసం ప్రతిపాదనలు

- మంత్రి దామోదరకు అందజేసిన ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల కోసం ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఇహెచ్ఎస్)ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల జెఎసి కోరింది. ఈ మేరకు వివిధ ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి నూతన ఈహెచ్ఎస్ విధానం అమలు కోసం ఒక ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి లచ్చిరెడ్డి, జెఎసి నాయకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ప్రస్తుతం అమలవుతున్న హెల్త్‌స్కీంలో ఉన్న లోటు పాట్లు, కొత్తగా ప్రతిపాదించిన హెల్త్ స్కీంతో ఉద్యోగులకు కలిగే ప్రయోజనాల గురించి మంత్రికి వివరించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీవోతో ఉద్యోగులు పడుతున్న కష్టనష్టాల గురించి మంత్రికి

సుశిక్షితులుగా ప్రొబేషనరీ ఐపిఎస్‌లు

- శిక్షణ పూర్తి చేసుకున్న 188 మంది ఐపిఎస్‌లు
- ఎన్‌పిఎ డైరెక్టర్ అమిత్ గార్గ్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా 76వ బ్యాచ్ ప్రొబేషనరీ ఐపిఎస్ అధికారులకు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాల్లో సుశిక్షితులను చేయటం జరిగిందని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్‌విపిఎన్‌పిఎ) డైరెక్టర్ అమిత్ గార్గ్ తెలిపారు. శివరాంపల్లిలలోని ఎన్‌పిఎలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శిక్షణను పూర్తి చేసుకున్న యువ ఐపిఎస్ అధికారుల గురించి అమిత్ గార్గ్ వివరాలు తెలియజేశారు. గత ఏడాది కాలంలో శిక్షణ నిమిత్తం ఎన్‌పిఎకు వచ్చిన 188 మంది ఐపిఎస్ అధికారులకు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నిరోధం, ఫోరెన్సిక్ సైన్స్, భారత నూతన చట్టాలు, ఉగ్రవాదం, తీవ్రవాదంతో పాటు పెరిగిపోతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా నిరోధంపై కట్టుదిట్టమైన శిక్షణనివ్వటం జరిగిందని వివరించారు. ముఖ్యంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో నేర ప్రపంచంలో వస్తున్న కొత్త కొత్త మార్పుల గురించి కూడా వారికి శిక్షణనిచ్చామని తెలిపారు. అంతేగాక, ఐటిబిపి, బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్, ఆర్మీతో పాటు తెలంగాణలోని గ్రేహౌండ్స్ విభాగంలో వీరికి అన్ని రంగాల్లో శిక్షణనివ్వటం జరిగిందని చెప్పారు. ముస్సోరిలోని ఐఎఎస్ శిక్షణ విభాగంతో పాటు, ఢిల్లీలోని ఐఐఎంలో సైతం పరిపాలన దక్షత పైన శిక్షణను పూర్తి చేసుకున్నారని ఆయన తెలిపారు.

ఐటీ మొదలుకొని అన్ని రకాల ఆయుధాలను వినియోగించటం, వాహనాలను నడపటంలోనూ వీరు ఆరితేరారని ఆయన అన్నారు. భారతదేశ మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రముఖ పట్టణాల్లో పరిస్థితులు, ప్రజల జీవన విధానం, వారి ఆచార వ్యవహారాలు ఇతర అంశాల పైనా ట్రైనీలకు శిక్షణా సమయంలో అవగాహన కల్పించటం జరిగిందని చెప్పారు. అలాగే, పలు కీలకమైన అంశాలపై సెమినార్లను నిర్వహించి వీరిని భాగస్వాములను చేయటం జరిగిందన్నారు. ఈ సారి ఎంపికైన బ్యాచ్‌లో ఉన్నత విద్యావంతులున్నారనీ, ముఖ్యంగా, వైద్య వృత్తి నుంచి వచ్చినవారు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. శిక్షణ పొందిన వారిలో 54 మంది మహిళలు కాగా, 19 మంది నేపాల్, భూటాన్, మారిషస్ దేశాలకు చెందిన యువ అధికారులు కూడా ఉన్నారని చెప్పారు. భారత్‌లోని హిందీతో పాటు కీలకమైన భాషల్లో కూడా యువ ఐపిఎస్‌లకు శిక్షణనిచ్చామన్నారు. ఎంపికైనా ఐపిఎస్‌లలో వివిధ రాష్ట్రాలకు కేటాయింపులు జరపగా తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు నలుగురు చొప్పున యువ ఐపిఎస్ అధికారులు కేటాయించబడ్డారని తెలిపారు. శుక్రవారం ఎన్‌పీఏలోని శిక్షణ పొందిన ఐపిఎస్ అధికారులు దీక్షాంత్ పరేడ్ ఉంటుందనీ, ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారని ఆయన తెలిపారు. కాగా, వైద్య వృత్తి నుంచి సివిల్ సర్వీస్‌లోకి, అది కూడా ఐపిఎస్ అధికారులుగా ఎంపిక కావటం వెనక ప్రజలకు పోలీసు శాఖ ద్వారా అన్ని విధాలుగా న్యాయం చేయవచ్చనే తమ లక్ష్యం ఉన్నదని పలువురు యువ ఐపిఎస్ అధికారులు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన యువ ఐపిఎస్‌లలో ఇద్దరు వరంగల్ జిల్లాకు చెందినవారు కాగా, ఒకరు జమ్మూకాశ్మీర్, మరొకరు యుపికి చెందినవారు ఉన్నారు. విలేకరుల సమావేశంలో అమిత్ గార్గ్‌తో పాటు జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌కు కుమారి ఆంటీ రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి స్ట్రీట్ ఫుడ్ నిర్వాహకురాలు కుమారి ఆంటీ రూ.50 వేలు విరాళం ప్రకటించారు. బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆమె..ముఖ్యమంత్రికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కుమారి ఆంటీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాలువాతో సన్మానించారు. సిఎంఆర్ఎఫ్‌కు పలు సంస్థలు విరాళం ప్రకటించాయి. ఆయా ప్రతినిదులు సిఎంకు చెక్కులు అందజేశారు. టెక్నో పెయింట్స్ రూ.20 లక్షలు, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెనర్స్ ఆఫ్ ఇండియా రూ.ఐదు లక్షలు, నారాయణ విద్యాసంస్థలు రూ.2.5 కోట్లు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రూ.50 లక్షలు, శ్రీరామ్ చిట్స్ రూ.కోటి, మోల్డెక్ ఇండస్ట్రీస్ రూ.25లక్షల చెక్కును సిఎంకు అందజేశాయి.

'అన్‌ఫిట్'లో అక్రమాలపై దృష్టి

- సమాచారం ఇస్తే రూ.10 వేలు నజరానా
- ఆస్తుల పరిరక్షణకు 'హైడ్రా' తరహా చర్యలు
- సింగరేణి సిఎండి ఎన్ బలరాం హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులను అన్‌ఫిట్ చేయించి, వారసత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా దళారులు అక్రమాలకు పాల్పడితే జైళ్లకు వెళ్లక తప్పదని ఆ సంస్థ సిఎండి ఎన్ బలరాం హెచ్చరించారు. సంస్థలో నిబంధనలు పాటించకుండా, ఇలాంటి అవినీతి, అక్రమాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమని, కచ్చితంగా కఠిన చర్యలే ఉంటాయని స్పష్టంచేశారు. సంస్థలో కొందరు దళారులు కావాలనే 'అన్‌ఫిట్' ప్రచారం చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. బుధవారంనాడాయన సింగరేణిలోని విజిలెన్స్ విభాగంపై సమీక్ష నిర్వహించారు. మెడికల్ బోర్డు ప్రక్రియలో దళారులపై సిబిడి నివేదిక ఇచ్చిందని, దీని ఆధారంగా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తరహా మోసాల వివరాలను కంపెనీ విజిలెన్స్ విభాగంలోని ఫోన్ నెంబర్ 9491144104కి లేదా vig@scclmines.com మెయిల్‌కు ఆధారాలతో పంపించాలని సూచించారు. కచ్చితమైన సమాచారాన్ని ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు, వారికి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతినీ ఇస్తామని చెప్పారు. సంస్థలో అవినీతిని అరికట్టడంలో కార్మికులతో పాటు సామాన్య ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తప్పుడు ధృవీకరణ పత్రాలు ఇచ్చి, అన్‌ఫిట్ అయ్యే ప్రయత్నం చేస్తే కంపెనీ ద్వారా లభించే టెర్మినల్ బెనిఫిట్లను నిలిపివేస్తామని హెచ్చరించారు. సంస్థలో ఏటా కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు పనులు జరుగుతున్నాయనీ, వీటి నాణ్యతపై విజిలెన్స్ నిఘాను పెట్టాలని ఆదేశించారు.

సంస్థలో 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీ కోసం తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సిబిటి) నిర్వహించి ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను కూడా విడుదల చేశామన్నారు. త్వరలోనే మరో 327 పోస్టుల ఫలితాలను విడుదల చేస్తామని చెప్పారు. సింగరేణి ఆస్తుల పరిరక్షణ కోసం హైడ్రా తరహా చర్యలు చేపట్టాలని భావిస్తున్నామన్నారు. దీనికి కార్మికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కొత్తగూడెం జనరల్ మేనేజర్ (విజిలెన్స్) ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరంచిన నిఖత్ జరీన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాక్సింగ్ ఛాంపియన్, అర్జున్ అవార్డు గ్రహీత నిఖత్ జరీన్ డిఎస్‌పిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జాయినింగ్ ఆర్డర్‌ను నిఖత్ జరీన్ డిజిపికి అందజేశారు. నిఖత్ జరీన్‌కు డిఎస్‌పి ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగంలో ఆమెకు డీఎస్పీగా ఉద్యోగం ఇస్తూ ఇటీవల హెూంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యలో తాజాగా ఆమె విధుల్లో చేరారు.

బిఆర్ఎస్ విజయాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకోవడం శోచనీయం

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెసిఆర్ పాలనలో ఎంఎస్ఎంఇల అభివృద్ధి, బిఆర్ఎస్ సాధించిన విజయాలను.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాల్లో వేసుకుంటూ గొప్పలు చెప్పుకోవడం శోచనీయమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బుధవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. కెసిఆర్ పాలనలో ఎంఎస్ఎంఇలు ఎంతో అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఎంఎస్ఎంఇలు మూతపడ్డా.. తెలంగాణ రాష్ట్రంలో అనుసరించిన ఐపాస్ లాంటి విధానాలు ఎంఎస్ఎంఇలను ధృఢంగా నిలిపాయని గుర్తు చేశారు. పెట్టుబడుల్లో 115 శాతం పెరుగుదలతో దేశంలో అగ్రగామిగా నిలవడంతో పాటు, ఉద్యోగాల కల్పనలో రాష్ట్రం 20 శాతం వృద్ధిరేటు సాధించిందని గుర్తు చేశారు. తెలంగాణలో ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు 30 శాతం ఉద్యోగ అవకాశాలు లభించాయని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఇ రంగంలో స్థిరమైన వృద్ధి నమోదు చేసి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బిఆర్ఎస్ పాలనలో సాధించిన ఘనతను వారి ఖాతాలో వేసుకుంటూ గొప్పలు చెప్పుకొంటోందని విమర్శించారు. ఎంఎస్ఎంఇల అభివృద్ధికి చేసిన కృషి, భవిష్యత్తు కార్యాచరణ ఏంటో చెప్పకుండా గత ప్రభుత్వ విజయాలతో కాలం గడపడం శోచనీయమని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

టివివిపి ఆస్పత్రుల ఉద్యోగుల్లో ఆందోళన

- సిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐసి, జిపిఎఫ్ చెల్లింపుల్లేవు
- అడిగితే డిప్యుటేషన్ వేస్తూ బెదిరింపులు
- కోట్ల రూపాయల కుంభకోణం
- విచారణ కోరుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ లోపిస్తే క్షేత్రస్థాయిలో దోపిడీకి అంతు లేకుండా పోతున్నది. అక్రమార్కులు రెచ్చిపోయి ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చేతివాటం ప్రదర్శించడం షరామామూలే. చివరకు ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసే రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత పొందేందుకు వీలుగా ప్రతి నెలా కూడబెట్టుకునేందుకు ఉన్న సిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐసి, జిపిఎఫ్‌లకు ఏళ్లుగా చెల్లించకపోవడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్నది. ముఖ్యంగా వరంగల్, హన్మకొండ జిల్లాల్లోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఈ దారుణమైన పరిస్థితి నెలకొన్నట్టు తెలుస్తోంది. వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట, హన్మకొండ జిల్లా పరిధిలోని కమలాపూర్ పరకాల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లకు సంబంధించి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్, కో ఆర్డినేటర్, ఆఫీస్ సిబ్బంది లీలలపై ఉద్యోగులు జోరుగా చర్చించుకుంటున్నారు. రెగ్యులర్ ఉద్యోగు లు డాక్టర్స్ మొదలు 4వ తరగతి ఉద్యోగుల వరకు సిపిఎఫ్, టిఎస్‌జిఎల్‌ఐసి, జిపిఎఫ్ కోసం ఉద్యోగుల నుంచి జీతాల నుంచి కట్ చేసుకుంటున్నారు. అయితే గత కొన్నేండ్లుగా వాటిని కట్టడం లేదని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై కొంత మంది ఉద్యోగులు కో ఆర్డినేటర్‌ను అడిగితే డిప్యూటేషన్స్ పేరుతో బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. ఇప్పటి వరకు రెగ్యులరైజేషన్ కాని ఉద్యోగులకు క్రమబద్ధీకరణ కాకుండా చూస్తానని బెదిరిస్తున్నట్టు సమాచారం. రెగ్యులర్ ఉద్యోగులకైతే ఐదేండ్ల నుంచి టీఎస్‌జేఎల్‌ఐఎస్ నెంబర్ లేకపోవడం గమనార్హం. అయితే ఇన్నేండ్లుగా ఇలాంటి పరిస్థితి నెలకొన్నా ఆడిట్ చేస్తున్న రాష్ట్రస్థాయి అధికారులు ప్రశ్నించకపోవడం పట్ల ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ పే నుంచి 10 శాతాన్ని సిపిఎఫ్ అమౌంట్‌గా కట్ చేస్తారు. టిఎస్‌జిఎల్‌ఐ కోసం కూడా కట్ చేస్తారు. అయితే తమ జీతాల నుంచి కట్ అవుతున్న అమౌంట్ వ్యక్తిగత ఖాతాల్లో జమ కావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇలాగే కొనసాగితే పదవీ విరమణ అనంతరం తాము నష్టపోతామనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలువురు ఉద్యోగులు స్థానికంగా ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు తమ జీతాల నుంచి మినహాయించిన సొమ్మును తమ వ్యక్తిగత ఖాతాల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించినట్టు తెలుస్తోంది. ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాల్లో కట్టకుండా ఆ డబ్బులు ఎక్కడికి వెళ్లాయో విజిలెన్స్ సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని వారు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

సిపిఎస్, టిఎస్‌జిఎల్‌ఐఎఫ్ సొమ్మును ఖాతాల్లో వేయాలి
- బైరపాక శ్రీనివాస్

ఉద్యోగుల జీతాల నుంచి సిపిఎస్, టిఎస్‌జిఎల్‌ఐఎఫ్ కోసం మినహాయించిన సొమ్మును వారి ఖాతాల్లో వేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) వైద్య విధాన పరిషత్ విభాగం కార్యదర్శి బైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అకౌంట్ లేని వారికి అకౌంట్ క్రియేట్ చేయాలని కోరారు. లేకపోతే యూనియన్ తరపున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఆరోగ్య మిత్రలతో చర్చలు వాయిదా

- సమ్మె యధాతథం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్య మిత్రలతో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం జరిపిన చర్చలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్రలు తమ వేతనాలు పెంచాలని గత ఆరు నెలలుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఆగస్టు ఆరున సమ్మె నోటీస్ ఇచ్చారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంతో అనివార్యంగా బుధవారం నుంచి సమ్మె ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో సమ్మెలో వందలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భూపాల్, ఆరోగ్యశ్రీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఎమ్. కుమార్, వివిధ జిల్లాల నాయకులు నాగరాజు విష్ణు, కిషోర్, రాజు, వజ్ర, దేవేందర్, ప్రణిత శ్రీదేవి, జయరాం, సంపత్, సుమన్, చిరుమయ్య తదితరులు నాయకత్వంలో హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ భవన్‌ను వందలాది మంది ఉద్యోగులు ముట్టడించి బైఠాయించారు. దీంతో ఆరోగ్యమిత్ర ప్రతినిధులతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో భూపాల్ తదితర నాయకులు మంత్రి దామోదర రాజనర్సింహ చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు ఆరోగ్యమిత్రల ఎదుర్కొంటున్న సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లను మంత్రి ముందుపెట్టారు. అనంతరం శుక్రవారం చర్చిద్దామని మంత్రి చెప్పడంతో నాయకులు సమ్మెను యధాతథంగా కొనసాగించనున్నట్టు వెల్లడించారు.

IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 588 OF 2023

Between:
Gali Laxmi ...Petitioner
AND
SK. Yousuf and Others ...Respondents

To,
R-2: P. Naveen Kumar, S/o. P. Prakasa Rao, Aged: Major, Occ: Owner, R/o. H.No. 4-125/4, South Swaroop Nagar, Uppal, Medchal, Telangana State-500039.

NOTICE

Please take notice that the above Petitioner had filed the above O.P. for compensation against you and Respondents No. 1 & 3. Several times notices was issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on the day of **10-10-2024** for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT)
Sd/- **L.R.PRAKASH, C.D.ARUNA, H. SHARON,** Advocates, H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad. Cell: 9866611022

IN THE HON'BLE COURT OF THE CHIEF JUDGE CITY SMALL CAUSES COURTS, AT HYDERABAD
M.V.O.P.NO.1177 OF 2023

Between:
Smt. Mare & another ...Petitioners
AND
Sri Gopala Krishnan & another ...Respondents

To
(R-1).
Sri Gopala Krishnan, S/o. Ramachandran, Aged: 44 Years, Occ: owner-cum-owner of Vehicle Maruthi (Swift) car bearing No. TS 07 HF 6911, R/o. H.No.21-61/2/A, Brindavan Colony, Shadnagar, Ranga Reddy Dist., Telangana State.

NOTICE

Take Notice that the above claimants filed above OP for compensation against you. The case is posted to 30-09-2024 for your appearance. Hence appear before the above said Court on 30-09-2024 at 10.30 am or else the matter will be decided as per law.

(BY ORDER OF THE COURT)
C.S. Choudary, M.A., B.L.,
Advocate
H.No.13-6-439/1/A/29, Balaji Nagar, Gudimalkapur, Hyderabad-500 006, Telangana State.

ఐస్ క్రీంలో గాజు ముక్కలు

- వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐస్ క్రీం కొనుగోలు చేసిన ఓ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. ఐస్ క్రీంలో గాజు ముక్కలు వచ్చాయి. ఈ ఘటన మేడ్చల్ జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం జరిగింది. వివరాల్లోకెళ్తే.. బోడుప్పల్ కార్పొరేషన్ వీరారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న విజయ్ కుమార్‌గౌడ్ పిల్లల కోసం సమీపంలోని మహాలక్ష్మి కిరాణం స్టోర్‌లో ఐస్ క్రీం (క్వాలిటీ వాల్స్)లు మూడు కొనుగోలు చేశాడు. అయితే, వాటిని తింటుండగా గాజు పెంకులు బయటపడ్డాయి. దీంతో కొనుగోలుదారుడు వెంటనే షాప్ యజమానిని ప్రశ్నించగా.. తనకేమీ తెలియదని, మీరు కొనుగోలు చేసిన ఐస్ క్రీం కంపెనీ టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించాడు. విజయ్ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏది పడితే అది కొనుగోలు చేసి తినకూడదని, తాను పిల్లల కోసమని ఐస్ క్రీం కొనుగోలు చేస్తే గాజు పెంకులు వచ్చాయని అన్నారు. ఒకవేళ అవి చూడకుండా తింటే తమ పిల్లలకు ఇబ్బందులు ఎదురయ్యేవని ఆందోళన వ్యక్తం చేశారు. తిండి పదార్థాల తయారీలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

అందరి సహకారంతోనే

గణేశ్ నిమజ్జనం విజయవంతం

- నెల రోజులుగా అన్ని శాఖల సమన్వయం
- హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విలేకర్లతో మాట్లాడుతున్న గద్వాల్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగరంలో గణేశ్ నిమజ్జనం అధికారులు, ప్రజలందరికీ సహకారంతో విజయవంతమైందని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మేయర్ విలేకరులతో మాట్లాడారు. ఈసారి 1.15లక్షలకుపైగా విగ్రహాలను నిమజ్జనం చేశారని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందన్నారు. నెల రోజుల నుంచి జీహెచ్ఎంసీ అధికారులు, శానిటేషన్ కార్మికులు, సిబ్బంది, ఉద్యోగులు అహర్నిశలూ రాత్రింబవళ్లు తేడా లేకుండా పని చేశారన్నారు. అందరి కృషితో నిమజ్జనం ప్రశాంతంగా ముగిసిందని, అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచనలు, సలహాలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పోలీస్, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్ శాఖల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరిగాయన్నారు. శానిటేషన్ కార్మికులు షిఫ్ట్ సిస్టమ్‌లో 24 గంటలపాటు పనిచేశారన్నారు. గణేష్ ఉత్సవాల కోసం జీహెచ్ఎంసీ 73 వివిధ పాండ్స్, చెరువుల వద్ద అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. మొత్తం 465 స్టాటిక్, మొబైల్ క్రేన్‌లు ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు వ్యర్థాలను ఎప్పటికప్పుడూ తొలగించారన్నారు. రెండోరోజు నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా తదితర ప్రాంతాల్లో టిఫిన్, భోజనాన్ని ఉచితంగా అందించామని తెలిపారు. క్రేన్ ఆపరేటర్లు, వారి సహాయకులు, గణేష్ మండపాల నిర్వహకులతోపాటు దాదాపు 2000మందికి టిఫిన్స్, 4000 మందికి భోజనాలు అందించామన్నారు.

శానిటేషన్‌పై దృష్టి

జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన పక్రియ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని, ఇక శానిటేషన్‌పై దృష్టి పెడతామని జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి కాట తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్షేత్ర స్థాయిలో డిప్యూటీ కమిషనర్‌లు, యుబిడి, యుసిడి, పోలీస్, విద్యుత్ విభాగాల అధికారులు, నిర్వాహక మండలి ప్రతినిధుల సూచనలు, సలహాలతో ముందుకెళ్లామన్నారు. ఇందులో భాగంగానే రోడ్డు మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించడం, విద్యుత్ దీపాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెండో రోజు కూడా నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందన్నారు. నిమజ్జనం పూర్తయిన ప్రాంతంలో శానిటేషన్‌పై దృష్టి సారించాలని జోనల్ కమిషనర్‌లకు సూచించారు.

మెడికవర్ హాస్పిటల్స్‌లో సురక్షిత హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రఖ్యాత ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రాజశేఖర్ మాదాల ఆధ్వర్యంలో మూడు నెలల్లోనే 100కు పైగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేసారని మెడికవర్ హాస్పిటల్స్ సగర్వంగా ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాదాల మాట్లాడుతూ ఫోలిక్యులర్ యూనిట్ ఎక్స్‌ట్రాక్షన్ వంటి ఆధునిక హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ విధానాలు అత్యంత సురక్షితమైనవని చెప్పారు. సాంకేతికతలో అభివృద్ధితో, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్లు సూటిగా, తక్కువ-రిస్క్, డే కేర్ విధానంగా మారాయని అన్నారు. జుట్టు రాలడం సమస్య పురుషుల్లో 85 శాతానికి పైగా, మహిళల్లో 40శాతం ఉందని చెప్పారు. వంశ పారంపర్యంగా లేక ఒత్తిడి, హార్మోన్ల మార్పులు, సరైన ఆహారం, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలు కూడా సమస్యకు దోహదం చేస్తున్నాయి అని అన్నారు. సాధారణంగా 30 ఏళ్ల తర్వాత స్థిరంగా జుట్టు రాలుతున్న వారికి హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్లు చాలా ప్రభావవంతంగా ఉంటుందని అన్నారు. ఈ చికిత్స కేవలం నాలుగు నుండి ఐదు గంటల్లో పూర్తవుతుందని తెలిపారు.

మాధవానంద సరస్వతి స్వామిని దర్శించుకున్న శాసనసభ స్పీకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేటలోని మాధవానంద సరస్వతి స్వామి ఆశ్రమాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం సందర్శించారు. ముందుగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్వామి చాతుర్మసా దీక్ష సందర్భంగా ఆశ్రమంలో పౌర్ణమిని పురస్కరించుకొని నిర్వహించనున్న ప్రత్యేక పూజలో స్పీకర్ పాల్గొన్నారు. అనంతరం మాధవానంద సరస్వతి స్వామిని దర్శించుకున్న స్పీకర్ విలేకరులతో మాట్లాడారు. స్వామి వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్టు చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో అంచెలంచెలుగా అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే శివరాత్రి తర్వాత ఒకరోజు ప్రభుత్వ సెలవు ఇప్పించాలని మాధవానంద సరస్వతి స్వామి స్పీకర్‌ను కోరారని అన్నారు. ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకుపోయే ప్రయత్నం చేస్తానని చెప్పారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, నర్సాపూర్ ఆర్‌డిఒ జగదీశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ దవాఖాన్లను నాశనం చేసే కుట్రలు మానుకో

- కెటిఆర్‌కు మంత్రి దామోదర రాజనర్సింహ హితవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ దవాఖాన్లను నాశనం చేసే కుట్రలను మానుకోవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కెటిఆర్‌ను హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వాస్పత్రులను బిఆర్ఎస్ పదేళ్ల పాటు దెబ్బతీశారని విమర్శించారు. గాంధీ వంటి టెర్షియరీ కేర్ హాస్పిటళ్లకు అత్యంత విషమంగా ఉన్న పేషెంట్లు వస్తారు. చివరి నిమిషం వరకూ వాళ్ల రోగాన్ని నయం చేసి, ఎలాగైనా వాళ్లను బ్రతికించేందుకు డాక్టర్లు తమ శక్తిమేర ప్రయత్నిస్తారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండడం వల్ల కొంత మంది ప్రాణాలు కోల్పోతారు. అందుకే దేశంలోని ఏ టెర్షియరీ కేర్ హాస్పిటల్‌లోనైనా, ప్రతి నెలా పదుల సంఖ్యలో మరణాలు జరుగుతుంటాయని మంత్రి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే మరణాలు జరిగాయంటూ నెంబర్లను భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నాన్ని చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీని నాశనం చేసి, పేషెంట్లను రానీయకుండా చేసి కార్పొరేట్ హాస్పిటళ్లకు లబ్ధి చేకూర్చాలని ఆయన కుట్ర పన్నుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిన ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాడిన పెట్టేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు మంత్రి తెలిపారు.

గత రెండేళ్ల నుంచి గాంధీ ఆస్పత్రిలో మరణించిన మాతా, శిశువుల వివరాలను మంత్రి వెల్లడించారు. 2022లో 84 మంది, 2023లో 108 ప్రసూతి మరణాలు జరిగితే ఈ ఏడాది ఆగస్టు నాటికి 68 జరిగినట్టు తెలిపారు. 2022లో 416, 2023లో 430 మంది, ఈ ఏడాది ఆగస్టు నాటికి 241 మంది చిన్నారులు చనిపోయినట్టు వివరించారు.

గురుకులంలో ముగ్గురు విద్యార్థుల అదృశ్యం

- వారి వద్ద కల్లు ప్యాకెట్ గుర్తించిన స్టాఫ్ నర్సు
- మరుసటి రోజు ప్రహరీ దూకి వెళ్లిపోయిన విద్యార్థులు
- నల్లగొండ జిల్లా దేవరకొండ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామ పరిధిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల సంక్షేమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ముగ్గురు అదృశ్యమయ్యారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండ భీమనపల్లి గ్రామ శివారులో ఖాదర్ మెమోరియల్ ఇంజనిరింగ్ కళాశాల ఆవరణలో తెలంగాణ మైనార్టీ గురుకుల సంక్షేమ పాఠశాల, బిసి గురుకుల సంక్షేమ పాఠశాలలను నిర్వహిస్తున్నారు. నేరేడుచర్ల మండలం జాన్‌పహాడ్‌కు చెందినషేక్ తౌఫిక్ ఉమర్, కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ రహమాన్, అనుమల మండలం హజారిగూడెంకు చెందిన షేక్ ముజీబ్ ఇక్కడ పదో తరగతి చదువుతున్నారు. ఈ నెల 16న మిలాదీ నబీ, గణేష్ నిమజ్జనం నేపథ్యంలో సెలవు ఉంది. అదే రోజు పక్కనే ఉన్న బిసి గురుకుల పాఠశాల ప్రహరీ అవతలి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ముగ్గురు విద్యార్థులకు ఒక ప్యాకెట్ ఇచ్చారు. గమనించిన పాఠశాల స్టాఫ్ నర్స్ జ్యోతి విద్యార్థుల దగ్గరున్న ప్యాకెట్‌ను పరిశీలించి కల్లు ప్యాకెట్‌గా గుర్తించారు. దీంతో విద్యార్థులను మందలించారు. దాంతోపాటు ప్రిన్సిపల్ అశోక్‌కు సమాచారం ఇచ్చారు. బిర్యానీ ప్యాకెట్ అంటే తీసుకున్నామని, ఇచ్చిన వాళ్లు ఎవరో తెలియదని విద్యార్థులు తెలిపారు. ఉపాధ్యాయులు ఈనెల 16న విద్యార్థుల తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఏమంటారో అనే భయంతో ముగ్గురూ మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు టిఫిన్ చేసిన అనంతరం ప్రహరీ దూకి పారిపోయారు. ఉదయం ప్రార్థనలో వారు కనిపించకపోవడంతో వెంటనే తల్లిదండ్రులకు తెలియజేశారు. అదే రోజు దేవరకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే, పాఠశాల సిబ్బంది విద్యార్థుల సామగ్రి పెట్టెలను వెతకగా ఒక లెటర్ దొరికింది. అందులో.. "ఒత్తిడి చేస్తున్నారని, తమను తల్లిదండ్రులు, మిత్రులు క్షమించాలని, తాము పాఠశాల నుంచి వెళ్లిపోతున్నామని, తమ కోసం ఎవరూ వెతకొద్దని" పేర్కొన్నట్టు సమాచారం.

కల్లు ప్యాకెట్ దొరికిందన్న భయంతోనే..

కల్లు ప్యాకెట్ దొరకడం వల్ల భయంతోనే ముగ్గురు విద్యార్థులు మంగళవారం పాఠశాల కాంపౌండ్ వాల్ దూకి వెళ్లిపోయారని వైస్ ప్రిన్సిపల్ హనుమంతు అశోక్ ప్రిన్సిపల్, మైనార్టీ గురుకుల పాఠశాలల రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ విష్ణుమూర్తిగౌడ్ విలేకరులకు తెలిపారు. కాంపౌండ్ వాల్ దూకి వెళ్లినట్టు సిసి కెమెరాలలో రికార్డు అయినట్టు చెప్పారు. తల్లిదండ్రులు బుధవారం పాఠశాలకు వచ్చారని, జరిగిన విషయం చెప్పామని, దీంతోపాటు పోలీసులకూ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. విద్యార్థుల వద్ద ఫోను ఉన్నట్టు, చాటింగ్ చేస్తున్నట్టు తోటి విద్యార్థులు తెలిపారన్నారు. విద్యార్థుల మిస్సింగ్‌పై వైస్ ప్రిన్సిపల్ అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ నరసింహులు, ఎస్ఐ రమేష్ తెలిపారు.

జమిలి ఎన్నికలకు మేం వ్యతిరేకం

- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీబుధవారం "ఎక్స్" వేదికగా స్పందించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. ఈ విధానం ఇది ఫెడరలిజాన్ని నాశనం చేస్తుందని ఆరోపించారు. రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో భాగమైన ప్రజాస్వామ్యాన్ని ఇది రాజీ చేస్తుందని విమర్శించారు. ప్రధాని మోడీ, అమిత్ షాకు తప్ప.. ఎవరికీ బహుళ ఎన్నికలు సమస్య కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం నేపథ్యంలో మనకు ఏకకాల ఎన్నికలు అవసరం కాదని తేల్చిచెప్పారు. తరచుగా ఆవర్తన ఎన్నికలు ప్రజాస్వామ్య జవాబుదారీతనాన్ని మెరుగుపరుస్తాయని ఓవైసీ పేర్కొన్నారు.

పాలసీని చట్టబద్ధం చేయాలి

- పరిశ్రమలశాఖలో ఖాళీలు భర్తీ చేయాలి
- ఎఫ్ఎస్ఎంఇ జాతీయ అధ్యక్షులు ఎపికె రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక పాలసీ భేషుగ్గా ఉందని, అయితే దాన్ని చట్టరూపంలో తెచ్చి, బడ్జెట్ కేటాయింపులు చేస్తేనే ప్రయోజనం ఉంటుందని ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైనర్స్ (ఎఫ్ఎస్-ఎమ్ఈ) జాతీయ అధ్యక్షులు ఎపికె రెడ్డి చెప్పారు. పాలసీలో పేర్కొన్న అంశాలు, క్షేత్రస్థాయిలో దాని అమలు వేర్వేరుగా ఉంటాయని, చట్టబద్ధత కల్పిస్తే అమలు చేయక తప్పదని స్పష్టం చేశారు. బుధవారం హైటెక్స్‌లో సీఎం ఏ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు పారిశ్రామిక పాలసీని ఆవిష్కరించిన కార్యక్రమంలో ఆయన కూడా పాల్గొన్నారు. అనంతరం పాలసీపై ఎఫ్ఎస్ఎంఇ అభిప్రాయాలను తెలిపారు. గడచిన పదేళ్లలో పరిశ్రమలకు దాదాపు రూ.3,900 కోట్ల ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని దశలవారీగా ఇస్తామనీ సీఎం ప్రకటించారని చెప్పారు. అయితే దాన్ని విడతలవారీగా ఇవ్వకుండా, ఆయా పరిశ్రమల విద్యుత్, సేల్స్‌ట్యాక్స్ రాయితీల్లో బుక్ అడ్జస్ట్‌మెంట్ చేస్తే సరిపోతుందని సూచించారు. అలాగే పరిశ్రమలకు ప్రభుత్వ గ్యారెంటీతో పావలా వడ్డీ రుణాలు ఇస్తే నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఏ) సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. మూడ్నెల్లకోసారి జరిగే రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం (ఎస్-ఎల్‌బిసి)లో తప్పనిసరిగా పరిశ్రమల శాఖ మంత్రి, ముఖ్య కార్యదర్శి కూడా పాల్గొంటే, అనేక సమస్యలకు అక్కడే పరిష్కారం లభిస్తుందని సూచించారు. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటును స్వాగతిస్తున్నామన్నారు. ప్రధానంగా పరిశ్రమల శాఖలో సుదీర్ఘకాలంగా రిక్రూట్‌మెంట్లు లేవని, అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తొలుత దీనిపై దృష్టిపెట్టి, ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ఆ శాఖకు చెందిన కార్యాలయాల్లో కనీస మౌలిక సౌకర్యాలూ లేవని గుర్తుచేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుకు వినతిపత్రాలు అందచేశామని తెలిపారు.

జానీ మాస్టర్‌పై ఫోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ డ్యాన్సర్ జానీ మాస్టర్‌పై నార్సింగి పోలీసులు బుధవారం ఫోక్సో కేసు నమోదు చేశారు. తనపై జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని మహిళా కొరియోగ్రాఫర్ రాయదుర్గంలో ఫిర్యాదు చేయగా అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును నార్సింగి పిఎస్‌కు కేసును బదిలీ చేసిన విషయం తెలిసిందే. అయితే జానీ మాస్టర్ తనను గతంలో సాంగ్ కొరియోగ్రాఫీ కోసం ముంబాయికి తీసుకెళ్లారని, అక్కడ హెూటల్‌లో తనపై లైంగికదాడికి పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆ సమయంలో తాను మైనర్‌నని తెలిపింది. అలాగే హైదరాబాద్‌లోనూ, ఇతర అవుట్ డోర్ షూటింగ్స్ సమయాల్లోనూ తనపై లైంగికదాడికి పాల్పడినట్టు యువతి తెలిపింది. ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపేస్తానని జానీ మాస్టర్ బెదిరించారని ఆరోపించింది. అయితే మైనర్‌పై లైంగికదాడికి పాల్పడిన నేపథ్యంలో జానీ మాస్టర్‌పై నార్సింగి పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం జానీ మాస్టర్ పరారీలో ఉన్నారు. అతన్ని పట్టుకోవడం కోసం నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్టు పోలీసులు తెలిపారు. త్వరలోనే అతన్ని అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని వెల్లడించారు.

పిఎన్ రావు స్టోర్ ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్

అత్యుత్తమ పురుషుల సూట్ మేకర్ పిఎన్ రావు హైదరాబాద్‌లో తన ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ఏర్పాటు చేశారు. జూబ్లిహిల్స్‌లో ఏర్పాటు చేసిన దీనిని బుధవారం పిఎన్‌రావు పార్ట్‌నర్స్ మచ్చేందర్ పషి, కేతన్ పిషీ, నవీన్ పిషి, పిఎన్ రావు లాంఛనంగా ప్రారంభించారు. ఇది దక్షిణాదిలో తమకు 8వ స్టోర్ అని కేతన్ పిషి తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులో ఐదు, చెన్నైలో రెండు స్టోర్లను కలిగి ఉన్నామన్నారు.

రేవంత్ రెడ్డి భాష హానికరం

- బిఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాష హానీకరమని, అందుకే ఆయన మాటలను ప్రసారం చేసే ముందు ఈ భాష హానీకరమని హెచ్చరికను ప్రసారం చేయాలని బిఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపిలో ఉన్నప్పుడు చంద్రబాబు దేశానికి కంప్యూటర్ పరిచయం చేశారని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడేమో రాజీవ్ గాంధీ తెచ్చారని చెబుతున్నారని ఎద్దేవా చేశారు.

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ తొమ్మిది నెలలైనా ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదని విమర్శించారు. ఎంత మంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయనేది ప్రకటించలేదని చెప్పారు. ఫిరాయింపులపై రాహుల్ గాంధీది, రేవంత్ రెడ్డిది చెరోదారి అని విమర్శించారు. దృష్టి మళ్లించేందుకే హైడ్రా డ్రామాలను ఆగ్రహం వ్యక్తం చేశారు. హిమాయత్‌సాగర్‌లో ఉన్న ఆనంద కన్వెన్షన్‌ను ఎందుకు కూల్చలేదు? అని ప్రశ్నించారు.

నర్సుల నిర్లక్ష్యం.. శిశువు మృతి !

- కాలుతో పొట్టపై నొక్కి బలవంతంగా బిడ్డను తీశారని బాధితుల ఆరోపణ
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియాస్పత్రిలో దారుణం జరిగింది. రాత్రి వేళ పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి సాధారణ ప్రసవం చేయగా.. అనంతరం శిశువు చనిపోయాడు. డ్యూటీలో ఉన్న నర్సులు, సిబ్బంది నిర్లక్ష్యం మూలంగానే తమ బిడ్డను కోల్పోయామని బాధితులు హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం, ఆళ్లగడప గ్రామానికి చెందిన నాగరాజు తన భార్యను ప్రసవం కోసం ఈ నెల 15న హుజూర్‌నగర్ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించాడు. సోమవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో సాధారణ ప్రసవం చేస్తామని నర్సులు చెప్పారు. అయితే, నర్సులు కాలుతో పొట్టపై నొక్కి శిశువును బలవంతంగా బయటకు తీశారు. అనంతరం శిశువును సూర్యాపేట జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపించారు. మంగళవారం ఉదయం శిశవు మృతిచెందింది. దీంతో సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన బిడ్డ చనిపోయిందని నాగరాజు హుజూర్‌నగర్ ఏరియాస్పత్రికి వచ్చి ఆందోళన చేశారు. సిబ్బంది ముందే చెప్పి ఉంటే ఏదో ఒక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి తన భార్యకు కాన్పు చేయించుకునేవాడినని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ల నిర్లక్ష్యం మూలంగానే బిడ్డను కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డాక్టర్ సమక్షంలోనే ప్రసవం..

ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్

సోమవారం ఉదయం డ్యూటీ డాక్టర్ గైనకాలజిస్ట్ సంధ్య ఆస్పత్రిలోనే ఉన్నారు. ఆమె సమక్షంలోనే కాన్పు జరిగింది. బాబు పుట్టిన వెంటనే ఏడవకపోవడంతో పరీక్షించి మెరుగైన వైద్య సేవల కోసం జిల్లా ఆస్పత్రికి పంపించాం. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదు.

జెపి ఆస్పత్రిలో యువకుడు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలో ఘటన

ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్పత్రిలో తలకు ఆపరేషన్ అనంతరం ఓ యువకుడు మృతిచెందాడు. అయితే, వైద్యుల నిర్లక్ష్యం వల్లే అలా జరిగిందంటూ బంధువులు ఆందోళన చేశారు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ జెపి ఆస్పత్రిలో బుధవారం జరిగింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ పట్టణానికి చెందిన అజయ్ (32) తండ్రి పంజాల రవి రెండు నెలల కిందట మృతిచెందాడు. అప్పటి నుంచి అజయ్ మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దాంతో ఘటకేసర్ మండలం కాచవాణి సింగారం ముత్వెల్లిగూడెంలో నివాసం ఉంటున్న సోదరి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 15న బాత్ రూంకు వెళ్తున్న సమయంలో కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు పీర్జాదిగూడలోని శబరి గార్డెన్ సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతనికి తలకు సంబంధించిన సమస్య ఉందని, వెంటనే పీర్జాదిగూడలోని జెపి ఆస్పత్రికి వెళ్లాలని డాక్టర్లు సూచించారు. అక్కడ పరీక్షలు నిర్వహించి.. ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని.. ఏమీ కాదని జెపి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ భార్గవ్ అజయ్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం న్యూరో సర్జన్ డాక్టర్ బ్రహ్మ ప్రసాద్ నేతృత్వంలోని అజయ్‌కి ఆపరేషన్ చేశారు. అందుకుగాను కుటుంబసభ్యులు సుమారు మూడు లక్షలు రూపాయల బిల్లు కట్టారు. అంతాబాగానే ఉందన్న వైద్యులు.. బుధవారం ఉదయం గుండెపోటుతో అజయ్ మృతిచెందాడని చెప్పారు. కుటుంబ సభ్యులు లబోదిబోమంటు గుండెలు బాదుకున్నారు. తాము వేరే ఆస్పత్రికి తీసుకెళ్తామని చెప్పినా.. ఇక్కడ అన్ని రకాల వైద్యులు ఉన్నారని ఆందోళన వద్దని చెప్పి ఇప్పుడు మృతిచెందాడని చెప్పటం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల కిందటే భర్తను కోల్పోయిన మృతుడి తల్లి.. ఇప్పుడు ఎదిగిన కొడుకు కూడా దూరమవ్వడంతో గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. అజయ్ మృతికి వైద్యులే కారణమంటూ బంధువులు ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు.

అతన్ని కాపాడే ప్రయత్నం చేశాం..

డాక్టర్ ఉదయ్, మత్తు ఇంజక్షన్ వైద్యులు, జెపి ఆస్పత్రి

అజయ్ మెదడులో రక్తస్రావం సమస్యతో తమ ఆస్పత్రికి వచ్చాడు. అప్పటికే అతను అపస్మారక స్థితిలో ఉన్నాడు. పరీక్షించిన వైద్య బృందం అతని సమస్యను కుటుంబ సభ్యులకు వివరించింది. అతన్ని కాపాడేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశాం. ఆపరేషన్ అనంతరం అతనికి గుండెపోటు రావడంతోనే మృతిచెందాడు.

దేశాభివృద్ధి కోసమే జమిలీ ఎన్నికలు : ఏలేటి

ప్రాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశాభివృద్ధిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికల దిశగా అడుగులు వేస్తున్నదని బిజెపి ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని సామాజికతరగతుల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వ వంద రోజుల పాలన పూర్తయిందని తెలిపారు. మహిళా సాధికారత కోసం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. 75 ఏండ్ల పైబడిన ఆరు కోట్ల మందికి హెల్త్ కార్డులు ద్వారా ప్రయోజనం దక్కనున్నదన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని ఇకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. జమిలి ఎన్నికలతో డబ్బు, సమయం ఆదా అవుతాయని చెప్పారు. దేశంలో నిత్యం ఎన్నికలతో అభివృద్ధి కుంటుపడుతున్నదన్నారు. త్వరలో జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్ ప్రవేశపెడతారని చెప్పారు. ప్రతిపక్షాలకు అభ్యంతరాలుంటే చర్చలో చెప్పాలని సూచించారు.

తల్లీబిడ్డల మరణాల లెక్కలను ఎందుకు దాస్తున్నారు?

- కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏ తప్పు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వం తల్లిబిడ్డల మరణాల లెక్కలను ఎందుకు దాస్తున్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ప్రశ్నించారు. బుధవారం ఆయన ట్వీట్ చేశారు. గాంధీ ఆస్పత్రిలో 48 మంది శిశువులు, 14 మంది బాలింతల మరణాలను ఊహించుకుంటేనే ఒళ్లు జలదిరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో మందికి ప్రాణం పోసిన గాంధీ ఆస్పత్రిలో ఇంతటి విషాదానికి పాపమెవరిదని ప్రశ్నించారు. శిశువుల ప్రాణాలకు విలువలేదా?, తల్లుల గర్భశోకానికి జవాబు లేదా? అని నిలదీశారు. ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?, వ్యవస్థలు పని చేస్తున్నాయా? చెప్పాలంటూ ప్రశ్నించారు. లెక్కలు చెప్పేందుకు ప్రభుత్వం భయపడుతోందని, ఒక్క గాంధీ ఆస్పత్రిలోనే ఇన్ని మరణాలుంటే రాష్ట్రంలో పరిస్థితి ఏంటని ఆలోచిస్తేనే భయంగా ఉందని తెలిపారు. గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు, డెలివరీ అయితే కెసిఆర్ కిట్లు, సిజేరియన్ కాకుండా నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇస్తూ తల్లి, బిడ్డను ఇంటి దగ్గర దిగబెట్టి వచ్చేలా కేసీఆర్ వ్యవస్థలను తయారు చేశారని గుర్తుచేశారు. అది ఓ పాలకుడిగా ప్రజల బాధ్యత తీసుకోవటం ద్వారా సాధ్యమైందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి పాలన గాలికి వదిలి ప్రచార ఆర్భాటాలు, విగ్రహ రాజకీయాలు చేస్తున్నందుకే ఈ పరిస్థితి దాపురించిందని విమర్శించారు. 2023 వరకు మాతా, శిశు మరణాల రేటును తగ్గిస్తూ వచ్చిందని తెలిపారు. వ్యవస్థలో ఎక్కడ నిర్లక్ష్యం చోటు చేసుకున్నదో విచారించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని డిమాండ్ చేశారు.

ట్రక్ డ్రైవర్ల పిల్లలకు మహీంద్రా స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్ : దేశ వ్యాప్తంగా ట్రక్ డ్రైవర్ల కుమార్తెలకు స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు మహీంద్రా ట్రక్ అండ్ బస్ డివిజన్ తెలిపింది. వార్షిక సార్థి అభియాన్ పేరిటి 1,000 మంది బాలికలకు మద్దతును అందించనున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. 10వ తరగతిలో ఉత్తీర్ణులై 2024-25 ఆర్థిక సంవత్సరంలో పైచదువులు చదువుతున్న ప్రతిభావంతులైన దరఖాస్తుదారులకు ఒకొక్కరికీ రూ.10,000 చొప్పున 1,000 మందికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపింది. 2014 నుంచి ఇప్పటి వరకు 10,029 మందికి సాయం చేసినట్లు పేర్కొంది. దరఖాస్తుదారు తండ్రికి మహీంద్రా వాణిజ్య వాహనం ఉన్నా.. లేకపోయినా ఈ ఉపకారవేతనాలు ఇవ్వబడతాయని వెల్లడించింది.